కథ

# ది గ్రేట్ ట్రిక్

తిరుమలశ్రీ

సాయంత్రం ఆఫీసునుంచి వస్తూనే దిగాలుగా కూర్చున్న భర్తను చూసి ఆశ్చర్యపోయింది కాత్యాయిని. సరాసరి సోఫా దగ్గరకు వెళ్లి అందులో కూలబడడమూ, షూస్ విప్పుకోవడం కూడా మరిచిపోయి సాలోచనగా శూన్యంలోకి చూస్తూండమూ వింతగా అనిపించింది.

భర్త పక్కనే కూర్చుని అతని షర్టు గుండీలు విప్పుతూ-

‘‘ఏం జరిగిందండీ? ఎందుకలా వున్నారు? మీ మామూలు కూడా మరిచిపోయి పరాకుగా కూర్చున్నారెందుకు?’’ అనడిగింది.

వెంటనే జవాబివ్వలేదు రాజారావు. తరువాత మెల్లగా, ‘‘కాత్యా! నేనొక విషయం అడుగుతాను, చెబుతావా?’’ అన్నాడు.

విస్తుపోయి చూసిందామె, ఏమిటన్నట్లు.

‘‘కాత్యా! లోకంలో బాంధవ్యాలు నాకు ఎప్పటికీ అంతుపట్టని విషయం. ఓ కుటుంబంలోని పిల్లల వివాహబాధ్యత కన్నవారిది కాదా? పెద్దపిల్లలు తమ బ్రతుకులు తాము బ్రతుకున్నా, మిగతా పిల్లల బాధ్యత వహించవలసిందేనా?’’ అంటూన్న భర్త వంక అనుమానంగా చూసిందామె.



‘‘తమ్ముళ్ళు, చెల్లెళ్లూ..ఇలా ఒక్కొక్కరి పెళ్లిళ్లూ తలపైన వేసుకుని మోస్తూపోతే, వారి వారి స్వంత బాధ్యతలు తీర్చుకునేదెలా?’’ అన్నాడు రాజారావు మళ్లీ, ఆమె వదనంలోకి చూస్తూ.

ఎలర్ట్ అయిపోయింది కాత్యాయిని. రాజారావు చెల్లెలి పెళ్లికోసం ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి ఈమధ్య. ఆ పిల్లకు సంబంధం కుదిరి వుంటుంది.

చెల్లెలి పెళ్లికోసం డబ్బు సర్దమని రాసుంటాడు తండ్రి అతనికి.

‘‘ఇప్పుడే గట్టిగా వుండాలి తాను. లేకుంటే ఈ మెతక మనిషి ఇల్లు గుల్ల చేసేస్తాడు’’ అనుకుంది మదిలో.

‘‘పెళ్లిళ్లు కానివ్వండి, పురుళ్లు కానివ్వండి. కడుపులు చేతపట్టుకుని బయటకుపోయి ఎవరి బ్రతుకుతెరువుకు వాళ్లు పాట్లుపడుతున్న ఈకాలంలో కూడా జ్యేష్ఠులంటూ పిల్లల్ని పీడిస్తే చివరికి వాళ్లు దెష్టలుగా మిగిలిపోతారు. ఇది అసమంజసం, అమానుషం! పెళ్లిళ్లయిపోయాక ఎవరి బ్రతుకులు వారివే!’’ ఓ చిన్న లెచ్చరిచ్చిందామె.

‘‘కాని, కాత్యా! ఆపద్ధర్మంగా తల్లిదండ్రులను అవసరంలో ఆదుకోవడం పిల్లల ధర్మం కాదంటావా?’’

‘‘కానేకాదు. ఆపద్ధర్మమనుకుని ఉద్ధరించబోతే చివరికిది వట్టి ధర్మంగానే మిగిలిపోతుందండీ. అసలు అలాంటి ఆలోచనలను ఆదిలోనే త్రుంచివేయడం అందరికీ ఆరోగ్యకరం’’ తీర్పు ఇచ్చేసిందామె.

‘‘మగపిల్లలైనా, ఆడపిల్లలైనా అంతేనంటావా?’’ రెట్టించాతడను.

‘‘ఎవరైనా ఒకటే!’’ ఖచ్చితంగా అంది.

తరువాత, ‘‘ఇంటి దగ్గరనుంచి వుత్తరమేదైనా వచ్చిందా?’’ అనడిగింది అనుమానంగా.

‘‘ఊ’’ అన్నాడు.

తన అనుమానం నిజమయిందనుకుంది. ‘‘పెళ్లి కుదిరిందటనా?’’

‘‘ఊ’’

‘‘ముహూర్తాలు కూడా పెట్టించారా?’’

‘‘ఊ’’

‘‘ఎప్పుడో?’’

‘‘వచ్చేనెలలో.’’

‘‘డబ్బు సర్దమని రాసారా?’’

‘‘ఔను. పెద్దమనిషి అభిమానం చంపుకుని సాయం కోరితే, మొండిచెయ్యి చూపడానికి నా మనసు అంగీకరించడం లేదు, కాత్యా!’’ అన్నాడు. ‘‘అప్పోసప్పో చేసయినా ఆదుకోవాలనిపిస్తోంది’’

‘‘అప్పుచేసి మరీ ఆదుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మేలంటారు. మన దగ్గర పైసాలేదని రాసేయండి’’ అతని షూస్ విప్పి పక్కనపెడుతూ, ఖచ్చితంగా చెప్పేసిందామె.

‘‘అంతేనంటావా?’’

‘‘అంతే!’’ నిష్కర్షగా అంది.

‘‘సరే’’ అంటూ లేచాడతను.

అంత సులభంగా భర్త తన మాటను విన్నందుకు ఆనందించిందామె.

‘‘సంబంధం ఏ వూరిదో ఏమిటో రాసారా? ఉత్తరం ఇలాగివ్వండి చూస్తాను’’ అంది.

జేబులోంచి కవరు తీసి ఆమె చేతిలో పెట్టి గదిలోకి వెళ్ళిపోయాడతను.

కుతూహలంగా ఆ వుత్తరాన్ని చదివిన కాత్యాయిని తెల్లబోయింది. ఆమె వదనం వెలసిపోయిన చిత్రపటంలా అయిపోయింది.

ఆ వుత్తరం రాసింది- మామగారు కాదు.

పెళ్లి- ఆడపడుచుదీ కాదు.

దాన్ని తన తండ్రి రాసాడు- అల్లుడికి.

తన చెల్లెలి పెళ్లి- హఠాత్తుగా కుదిరిందట.

డబ్బు సర్దుబాటు చేసుకోవడానికి తగిన వ్యవధి లేదనీ, అల్లుణ్ణి ఎంత వీలయితే అంత సర్దమనీ రాసాడు.

అంతసేపు అత్తవారి గురించే ఆలోచిస్తూ ఏవేవో సలహాలు ఇచ్చింది తాను భర్తకు. కాని, అది తన పుట్టింటి అవసరం...!

అసలు విషయం చెప్పకుండా తన చేత కమిట్ చేయించిన భర్త కన్నింగ్‌నెస్‌కి పీకదాకా కోపం వచ్చిందామెకు. విసురుగా భర్త దగ్గరకెళ్లి-

‘‘ఏమండీ! మా చెల్లెలి పెళ్లని ముందుగా నాకెందుకు చెప్పలేదు! ఇది అన్యాయం!’’ అంది.

రాజారావు అదోలా నవ్వి, ‘‘న్యాయ సూత్రం ఎవరికైనా ఒకటేనని నువ్వే చెప్పావుగా, కాత్యా?’’ అన్నాడు అమాయకంగా ముఖంపెడుతూ.

‘‘అదికాదండీ. మా నాన్న..డబ్బు సమకూడక..పాపం..’’ అంటూ ఆమె ఏదో అనబోతుంటే-

‘‘సారీ డియర్! సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చేసింది. ఇక నో అప్పీల్..’’ అంటూ మరో మాటకు తావివ్వకుండా టవల్ తీసుకుని బాత్‌రూంలో దూరేసాడతను.

★

Editor T.Venkatram Reddy, Printed and Published by O.Thomas on behalf of Deccan Chronicle,
at Deccan Chronicle Press, 36 Sarojini Devi Road, Secunderabad-500003, Phone 7802346.